


# ఏది ముఖ్యం?

## వి.వి.యస్. రామదాసు

"నేను స్పెషలిస్టుని కాను కాని ఎందుకైనా మంచిది, బాబుని ఒకసారి వైద్య పరీక్ష చేయించు, వళ్ళీ" అని ఎం.బి.బి.ఎస్. ఫైనలియరు చదువుతున్న తన స్నేహితురాలు రత్నం అనిన మాటలకు పాతికేళ్ళ శ్రీవళ్ళి సందేహంలో పడింది.

రత్నం నిజంగానే యిటువంటి సలహా యిస్తున్నదా లేక తన అదృష్టాన్ని చూచి ఓర్వలేక కంగారు పెట్టాలని ఈ మాటలు అంటున్నదా అని శ్రీవళ్ళి తేల్చుకోలేక పోయింది.

సముద్రపు హోరు ఒక ప్రక్కనుంచి వినవస్తున్నది. కొంచెం దూరంలో ఇసుకతో పిచికగూళ్లు కడుతున్న నాలుగేళ్ళ బాబుని చూచి, వాడి చురుకుతనాన్ని చూచి, వానిలో లోపం ఉంటుంది అని శ్రీవళ్ళి ఊహించనైనా లేకపోయింది. వాడి తెలివితేటలు, వాడు మాట్లాడే ముద్దులొలికే మాటల తీరు వింటున్న శ్రీవళ్ళి వాని భవిష్యత్తు గురించి ఎన్నో గాలిమేడలు కట్టింది.

రత్నం, శ్రీవళ్ళి క్వీన్ మేరీ హైస్కూలు, విశాఖపట్టణంలో స్కూలుఫైనలు వరకు కలిసి చదువుకున్నారు. రత్నం కొంచెం అసూయ స్వభావంకలది అని శ్రీవళ్ళికి తెలుసును. నిజానికి రత్నం తలిదండ్రుల కంటె శ్రీవళ్ళి తలిదండ్రులు చాలా తక్కువ ఆర్థిక స్థితిలో ఉన్నవారు. అయినప్పటికి ఒక్కొక్కప్పుడు శ్రీవళ్ళి కట్టుకున్న పరికిణీలు చూచి రత్నం అసూయపడేది. అన్నింటికంటె ముఖ్యంగా శ్రీవళ్ళి వారి క్లాసు అంతటిలోనూ అందమైన పిల్ల అని అందరూ అభిప్రాయం వ్యక్తం చేయడం రత్నం సహించలేకపోయేది. ఎంత తక్కువ ఖరీదైన బట్టలనైనా శ్రీవళ్ళి ఎంతో నాజూకుగా ఒప్పేటట్లు కట్టుకుని తన సహజ సౌందర్యానికి మెరుగు పెట్టుకునేది.

ఇంక చదువులో మార్కుల విషయంలో వారిద్దరూ పోటీ పడేవారు. అన్ని బహుమతులూ తనకే రావాలనుకునేది రత్నం. కాని సగం బహుమతులు శ్రీవళ్ళికి పోయేవి. తక్కిన వాటిలోనయినా రత్నం ఆమెకంటె ఒకటి రెండు మార్కుల వ్యత్యాసంలోనే గెలుచుకోగలిగేది.

శ్రీవళ్ళి కంటె ఏ అంశాలలో రత్నం కొంచెం ఎక్కువగా ఉన్నదో వాటినే ఎత్తి చూపెడుతూ తృప్తిపడేది రత్నం. ఉదాహరణకు, శ్రీవళ్ళి దస్తూరీ ఆమె శరీర సౌందర్యం అంతటి సౌష్ఠవంగా ఉండేది కాదు. తెలిసేటట్లు మాత్రమే వ్రాయగలిగేది గాని గుండ్రంగానూ, సొగసుగానూ ఉండడంలో రత్నం దస్తూరి చాలారెట్లు శ్రీవళ్ళి దస్తూరికంటె మెరుగుగా ఉండేది. అందుచేతనే ఆమెకు సగం బహుమతులు వచ్చేవి.

దస్తూరీలోకూడా తనకంటె తక్కువగా ఉన్నప్పటికీ సగానికి సగం బహుమతులు శ్రీవళ్ళికి రావడం రత్నం అసూయకు కారణం అయేది.

ఇద్దరూ ఉత్తమశ్రేణిలోనే పాసయారు. కాని ఎంత ఉత్సాహం ఉన్నప్పటికీ ఆర్థిక యిబ్బందులవల్ల శ్రీవళ్ళి అంతటితో చదువు ఆపివేయవలసి వచ్చింది. రత్నం యింటర్మీడియేటులో జాయినయింది. రత్నం పై చదువులు చదువుకోగలిగిందికదా అని శ్రీవళ్ళి పెద్దగా అసూయపడలేదు. ఎవరి అదృష్టం వాళ్ళది అని సరిపెట్టుకుంది. శ్రీవళ్ళి కంటె తాను అధికురాలను కాగలిగానని రత్నం ఎంతో సంతోషించింది. వాళ్ళిద్దరూ బీచిలో రోజూ కలుసుకునేవారు.

అయితే ఒకనాడు కొత్తగా ప్లీడరు ప్రాక్టీసు పెట్టిన సుబ్బారావు బీచిలో శ్రీవళ్ళిని చూచి ఆమె సౌందర్యానికి ముగ్ధుడై ప్రథమ వీక్షణంలోనే ఆమెను ప్రేమించాడు. ఆమెను దూరంగా అనుసరించి ఆమె ఇల్లు ఎక్కడ ఉన్నదో తెలుసుకుని ఆమె తలిదండ్రుల్ని కలుసుకోవలసినదిగా తన తలిదండ్రులకు చెప్పి ఆమెను వివాహం చేసుకున్నాడు.

అప్పటికి రత్నం ఎం. బి. బి. యస్. మొదటి సంవత్సరంలో ప్రవేశించింది. డాక్టరు పరీక్ష చదువుతున్న తాను శ్రీవళ్ళి కంటె ఎంతో అధికురాలనని అనుకుంటున్న తరుణంలో శ్రీవళ్ళి సుబ్బారావుల కల్యాణం జరిగింది.

సుబ్బారావు ఆజానుబాహుడు. శ్రీవళ్ళి పొడగరి, లావణ్యమైన శరీరంకలది. ఆమె కంటె పొడుగైనవాడు, వుంగరాల జుత్తువాడు, ఆమె కేమాత్రం తీసిపోని అందం కలిగినవాడు సుబ్బారావు. అంతేకాక పేరు పొందిన ఆర్టిస్టుకూడా. కొంచెం పాడగలడు. అతని బహుముఖ ప్రజ్ఞ, వారి అనుకూల దాంపత్యం చూసిన రత్నం ఎంతో అసూయ పడేది.

సుబ్బారావు శ్రీవళ్ళి సౌందర్యాన్ని ఆరాధించేవాడు. అతడు అప్సరస చిత్తరువులను వేసినా, సరస్వతీ, లక్ష్మి, దుర్గ చిత్రాలను వేసినా, ఆఖరుకు కథానాయకురాలి చిత్రాలను వేసినా అన్నింటిలో శ్రీవళ్ళి సౌందర్యాన్నే ప్రస్ఫుటింపచేసేవాడు. దేశమంతట ప్రతి సచిత్ర వార, మాసపత్రికలలోనూ శ్రీవళ్ళి ముఖమే ముఖ చిత్రంగా ప్రత్యక్షమయ్యేది. ఆమెను చిత్రిస్తూ వేసిన ముఖచిత్రాలను మెచ్చుకుంటూ ఎన్నో లేఖలు పాఠకులనుంచి రోజూ సుబ్బారావుకి అందేవి.

"నిన్ను పత్రికలకు ఎక్కించి మీ వారు నీ సౌందర్యానికి అపచారం చేస్తున్నారే, వళ్ళీ" అని రత్నం అసూయను ఆపుకోలేక అంటే,

"పోనీలేవే. నాకు లేని బాధ నీ కెందుకే" అని శ్రీవళ్ళి ఆమె నోరు మూయించేది.

రత్నం ఎం.బి.బి.ఎస్. రెండవ సంవత్సరం చదువుతూ వుండగా శ్రీవళ్ళి, సుబ్బారావులకు పండంటి కొడుకు పుట్టాడు. దానితో ఆమె అందం తగ్గిపోతుందని రత్నం అనుకుంది కాని రానురాను శ్రీవళ్ళి లావణ్యం పెరిగినదేకాని తగ్గలేదు.

బాబుకి ఏడాదిదాటగానే వాణ్ణి తీసుకుని బీచికి వచ్చేవారు శ్రీవళ్ళి దంపతులు. వీలయినప్పుడల్లా బీచిలో వారిని రత్నం కలుసుకునేది.

బాబుకి నాలుగేళ్ళువచ్చాక ఒకనాడు మామూలుగా బీచికివెళ్లారు శ్రీవళ్ళి దంపతులు. బాబు కొంచెం దూరంలో ఇసుకతో పిచికగూళ్లు కడుతున్నాడు. వాని దగ్గరగా కూర్చుని సుబ్బారావు ఏదో స్కెచ్చి వేస్తున్నాడు, కెరటాలకేసి చూస్తూ.

రత్నం. శ్రీవళ్ళి మామూలుగా మాట్లాడుకుంటున్నారు. ఉన్నట్లుండి రత్నం, "చూడు వళ్ళీ, బాబుని అప్పుడప్పుడు డాక్టరు దగ్గరకు తీసుకుని వెళుతున్నావా ?" అన్నది.

"దేవుని దయవల్ల అటువంటి అవసరం రాలేదు. నువ్వు చెప్పినట్లు టీకాలు వేయించడమూ, ట్రిపిల్ యాంటిజన్ యింజెక్షన్ యిప్పించడమూ చేయించాను. తరువాత ఏవో కొన్ని డ్రాప్స్, కొంచెం టానిక్సూ వాడుతున్నాము. ఎప్పుడేనా జలుబుచేయడం తప్ప వాడికి ఏమీ జబ్బుచేయలేదు" అన్నది శ్రీవళ్ళి.

"వాడికి ఏ జబ్బూ చేయకూడదనే నా ప్రార్థన కూడా. అయినా నేను వైద్యశాస్త్రం చదువుతున్నానుకదా, ఏవేవో సందేహాలు వస్తాయి. పోనీ బాబుని అదే వయస్సులో ఉన్న మిగతా పిల్లలతో పోల్చి చూసుకున్నావా, వళ్ళీ?" అన్నది రత్నం.

"పోల్చడానికి ఏముంది? తెలివితేటల్లోను అల్లరిలోను, మాటలలోను, వాడి వయస్సు పిల్లలకు వాడేమీ తీసిపోడు" అన్నది శ్రీవళ్ళి.

"కావచ్చును. కాని వైద్యపరీక్ష అవసరం అనుకుంటాను. పరీక్ష చేయకుండా ఏమీ అభిప్రాయం చెప్పకూడదు."

"ఇంతకూ నీ అనుమానం ఏమిటి?"

"అనుమానం మాట అటుంచు. బాబు సరిగా ఎదుగుతున్నాడంటావా? వాడి వయస్సు పిల్లల్ని చూడు. వాళ్ళంత పొడుగుగా ఉన్నాడా? వాడు సరిగా తండ్రినిపోలాడు. వాడి తండ్రి ఎంత పొడగరో నీకు నేను చెప్పనక్కరలేదు. అంత పొడుగుగా ఉన్న తండ్రికొడుకు నాలుగేళ్ళప్పుడు ఎంత ఎదిగి ఉండాలో కొంచెం ఆలోచించు. నా మట్టుకు నాకు క్రిందటి సంవత్సరానికీ ఈ సంవత్సరానికీ బాబు ఏమీ ఎదగలేదనుకుంటున్నాను. అందుచేతనే డాక్టరు పరీక్ష అవసరం అంటున్నాను," అన్నది రత్నం.

"ఇంకా డాక్టరుచదువు పూర్తికాలేదు. అప్పుడే నువ్వు స్పెషలిస్టులా మాట్లాడుతున్నావేమే" అన్నది శ్రీవళ్ళి.

"నేను స్పెషలిస్టుని కాను కాని ఎందుకేనా మంచిది బాబుని ఒకసారి వైద్యపరీక్ష చేయించు, వళ్ళీ" అన్నది రత్నం.

ఆ మాటలకు శ్రీవళ్ళి సందేహంలో పడింది.

చిన్నప్పటినుంచి రత్నంకు ఎంత అసూయ స్వభావం ఉన్నా రానురాను అది తగ్గి ఉంటుంది. ఏమయినా ఒకసారి వైద్య



పరీక్ష చేయిస్తే పోయిందేమిటి అనుకుంది శ్రీవళ్ళి.

"అయితే రేపు బాబుని తీసుకుని హాస్పిటలుకి వస్తాను. ఆ పరీక్ష ఏదో నువ్వే చేయించిపెడుదూ" అని బ్రతిమాలింది శ్రీవళ్ళి.

"అలాగే లేవే. రేపు తప్పకుండా తీసుకుని రా" అని రత్నం వెళ్ళిపోయింది.

చీకటిపడగానే శ్రీవళ్ళి దంపతులు బాబుని తీసుకుని యింటికి వెళ్లారు. రత్నం తనతో చెప్పిన విషయాలను ఆమె అతనికి చెప్పలేదు. అనవసరంగా అతనిని ఎందుకు కంగారుపెట్టాలని ఊరుకుంది.

మరునాడు బాబుని తీసుకుని శ్రీవళ్ళి కింగ్‌జార్జి హాస్పిటల్‌కి వెళ్ళింది. మలపరీక్ష, మూత్రపరీక్ష, రక్తపరీక్ష జరిగాయి. అన్నీ నార్మలుగానే ఉన్నట్లు రిపోర్టులువచ్చాయి.

"ఇప్పటికి అన్నీ బాగానే ఉన్నాయి, వళ్ళి," అన్నది రత్నం.

"నాకు తెలుసునే. నీదంతా అనవసరమైన భయం," అన్నది శ్రీవళ్ళి.

"ఇంక ఎక్స్-రే పరీక్ష ఉన్నది. పద అక్కడకు వెళదాం" అని ఎక్స్-రే రూంకి బాబుని తీసుకువెళ్ళింది రత్నం.

బాబుకి ఎక్స్-రే తీశారు.

మరునాడు ఎక్స్-రే నెగిటివ్‌లు తీసుకుని సీనియర్ డాక్టరు దగ్గరకు వెళ్ళింది రత్నం. ఛాతీకి సంబంధించిన నెగిటివ్‌ను చూపించి, "ఆ ఎముకలు అంత యిరుకుగా ఉన్నాయేం డాక్టర్" అన్నది రత్నం.

"దాని గురించి చర్చించేముందు ఎండోక్రయిన్ గ్లాండ్స్ గురించి నీకు తెలిసినది కాన్‌స్తరివైజ్ చేయాలి. ఎండోక్రయిన్ గ్లాండ్స్ అన్నిటిలో ముఖ్యమైన గ్లాండ్ ఏది ?" అన్నాడు సీనియర్ డాక్టర్.

"పిట్యూటరీగ్లాండ్. దానినే మాస్టర్ గ్లాండ్ అంటారు. అది కనీసం తొమ్మిది హార్మోన్సును ఉత్పత్తిచేస్తుంది. దానికి మూడు లోబ్స్ ఉన్నాయి."

"కరెక్ట్. ముందరి లోబ్ ఉత్పత్తిచేసే హార్మోన్స్‌వల్ల ప్రయోజనం ఏమిటి ?" అన్నాడు సీనియర్ డాక్టర్.

"మృదువైన కండరాల్ని, మూత్రపిండాల్నీ అది కంట్రోలు చేస్తుంది," అన్నది రత్నం.

"కరెక్ట్ ఎగెయిన్. అది సరిగా లేకపోతే ఏమవుతుంది?"

"అది సరిగా లేకపోతే మూత్రపిండ వ్యాధులు వస్తాయి."

"చాలవరకు కరెక్ట్. మూత్రపిండ వ్యాధులు రావడానికి వేరే కారణాలు కూడా ఉన్నాయి. అది సరే. మధ్య లోబ్ ఉత్పత్తి చేసే హార్మోనులవల్ల ప్రయోజనం ఏమిటి?"

"శరీరం రంగు నిర్ణయిస్తాయి."

"కరెక్ట్. మరి, వెనుకటి లోబ్ ఎన్ని హార్మోన్స్ ఉత్పత్తి చేస్తుంది ? వాటి ప్రయోజనం ఏమిటి ?" అన్నాడు సీనియర్ డాక్టర్.

"కనీసం ఆరు హార్మోన్సును ఉత్పత్తి చేస్తుంది. మనిషి సరిగా ఎదగాలంటే, సవ్యంగా అభివృద్ధి కావాలంటే అవి చాలా అవసరం" అన్నది రత్నం.

"అందులో శరీర పరిమాణానికి సంబంధించిన హార్మోను పేరేమిటి?" అన్నాడు సీనియర్ డాక్టర్.

"సోమాట్రోపిన్. అది ఎక్కువగా ఉంటే మరీ పొడుగ్గా ఉంటారు. తక్కువగా ఉంటే మరుగుజ్జులా తయారవుతారు" అన్నది రత్నం.

''ఇప్పుడు బాబు కేసు చూడు. వాని శరీర లక్షణాలన్ని సవ్యంగా ఉన్నాయి. కాని వాడి ప్రక్కటెముకలు చూశావు కదా, ఎంత యిరుకుగా ఉన్నాయో. వాడి పిట్యూటరీ గ్లాండ్‌లో సోమాట్రోపిన్ తగినంత తయారు కావడం లేదు. అందుచేత వాడు మరుగుజ్జుగా ఉండిపోవలసినదే" అని సీనియర్ డాక్టర్ చెబుతూ ఉంటే రత్నం దిగ్భ్రమ చెందింది. ఆమెకు బాబుపట్ల జాలి కలిగింది. అంతకుముందు శ్రీవళ్ళి అంటే ఆమెకున్న అసూయ కరుణగా మారింది.

"అయితే డాక్టర్, దీనికి మందే లేదంటారా?'' అన్నది రత్నం ఖిన్నవదనంతో.

"మనలో మన మాటగా చెప్పాలంటే, లేదు. దీని విషయంలో ఇంకా రిసెర్చి జరగవలసి ఉంది. ఇంక నువ్వు వెళ్ళవచ్చు,'' అన్నాడు సీనియర్ డాక్టర్.

రత్నం ఆ సాయంత్రం విషాదహృదయంతో బీచికివెళ్లి శ్రీవళ్ళి దంపతులతో ఈ విషయం అంతా చెప్పింది. దూరంగా ఆడుకుంటున్న బాబుని ఒడిలోకి తీసుకుని వెక్కి వెక్కి ఏడ్చింది శ్రీవళ్ళి. సుబ్బారావు గంభీరంగా కనిపించాడే కాని ఆమెను ఎలా సముదాయించాలో అతనికి అర్థంకాలేదు.

"ఊరుకో, వళ్ళీ. లోకంలో మరుగుజ్జులు లేరా ? వాళ్ళంతా సుఖంగాలేరా ?" అని రుద్ధకంఠంతో రత్నం, ఊరట కలిగించటానికి ప్రయత్నించింది.

"నా శోకం నీకెలా అర్థమవుతుంది, రత్నం" అని మళ్లీ ఏడ్చింది శ్రీవళ్ళి.

అతి కష్టంమీద శ్రీవళ్ళిని రిక్షాలో ఎక్కించి సుబ్బారావు యింటికి వెళ్ళాడు.

వృద్ధులైన తలిదండ్రులతో ఈవృత్తాంతం చెప్పాడు సుబ్బారావు.

"మన వంశంలో ఎటువైపునా మరుగుజ్జులులేరే. ఇదెలా జరిగిందిరా" అన్నాడు సుబ్బారావు తండ్రి.

"ఖర్మకెవరేం చేయగలరు ?" అన్నది సుబ్బారావుతల్లి.

"ఈవిషయం ఎప్పుడూ, బాబుముందు మాట్లాడకండి. అదొకటే మనం వాడికి చెయ్యగల పెద్ద ఉపకారం. వాడు శాశ్వతంగా మరుగుజ్జుగా ఉండిపోతాడనే సంగతి యిప్పటినుంచే వాడిచెవిలో నూరిపోస్తుంటే అది వాడి లేతమనసుమీద ఎలా పనిచేస్తుందో చెప్పలేము" అన్నాడు సుబ్బారావు.

"ఏమిటండీ అలా మాట్లాడతారు. రత్నం చెప్పిన అభిప్రాయం పట్టుకుని మనం చేతులు ముడుచుకుని కూర్చోవడమేనా ? దేశంలోఉన్న స్పెషలిస్టులందరికీ బాబుని చూపించుదాము" అన్నది శ్రీవళ్ళి ధైర్యం చేసి.

"బాగా చెప్పావమ్మా, అలాగే చేద్దాం" అని ఆమె అత్తగారు ప్రోత్సహించింది.


"ఎంతడబ్బు ఖర్చయినాసరే వాడికి మందు యిప్పించుదాము" అని సుబ్బారావు కూడా అన్నాడు.

అతని తండ్రిమాత్రం నిరాశతో నిట్టూర్చాడు.

అప్పటినుంచి బాబుని తీసుకుని మదరాసు, బొంబాయి, ఢిల్లీ, కలకత్తా మొదలగు పట్టణాలు తిరిగి పేరుపొందిన స్పెషలిస్టులందరికి చూపించారు. అందరూ ఇంచుమించు ఒకటే అభిప్రాయం చెప్పారు, మరుగుజ్జుతనానికి మందులేదని. అయితే అంతమాత్రంచేత జీవితంలో పోయిందేమీ లేదనీ, బాబు యితరవిధాల బాగా ఉన్నాడనీ దీర్ఘాయువుకి కూడా ఏమీ అనుమానం లేదనీ చెప్పారు.

బాబుకి ఆరోఏడు వచ్చింది. అక్షరాభ్యాసం చేయించి బడిలోవేశారు.

"పొట్టివానికి పుట్టెడు బుద్ధులు" అన్నట్లు బాబు ఎంతో తెలివితేటలతో చదువుతున్నాడు.




తాతగారివద్ద అమరకోశం ఎంతో స్వచ్ఛమైన ఉచ్చారణతో చదివి అప్పగించేవాడు. తల్లి దగ్గర పాటలు నేర్చుకునేవాడు.

తండ్రి వేస్తున్న చిత్రాలను అనుకరిస్తూ వాడువేసే చిత్రాలనుచూచి వానికి చిత్రకారుడుగా ఎంతో భవిష్యత్తుఉందని మురిసిపోయేవాడు తండ్రి.

ఇన్ని తెలివితేటలున్న బాబు శాశ్వతంగా మరుగుజ్జుగా ఉండిపోతాడనే యథార్థం ఒకటే వారి సంతోష సంగీతంలో అపశృతిలా ధ్వనించేది.

రత్నం జాగ్రత్తగా చదివి ఎం. బి. బి. యస్. ఫస్టు క్లాసులో పాసయి హౌస్ సర్జన్‌షిప్‌కూడా పూర్తిచేసి ప్రాక్టీసు పెట్టింది.

రోజూ సాయంత్రం బీచికి రావడం మానివేసి ఆదివారం సాయంత్రం మాత్రమే వచ్చి శ్రీవళ్ళితో మాట్లాడేది.

రత్నంకు తానంటే యిదివరకున్న అసూయ పోయిందని శ్రీవళ్ళి గ్రహించింది. ఎప్పటికయినా రత్నం రిసెర్చిచేసి తన బాబు మరుగుజ్జుతనం పోగొట్టే మందు కనిపెట్టకపోతుందా అని ఆశపడింది శ్రీవళ్ళి.

"నువ్వు రిసెర్చి చేయకూడదా, రత్నం?" అని ఒకనాడు అడిగింది.

"ఎందుకు కూడదు? ముందు ఎం. డి. పూర్తికావాలి. దానితరువాతనే రిసెర్చి," అన్నది రత్నం.

"ఏమోనమ్మా, నువ్వు రిసెర్చిచేసి బాబు మరుగుజ్జుతనం పోగొట్టే మందు కనిపెడతావని ఆశపడుతున్నాను" అని తన మనసులో మాటను బయటకు చెప్పింది శ్రీవళ్ళి.

"నువ్వు రిసెర్చి అంటే జ్ఞాపకంవచ్చింది. ఈమధ్య కోతుల గ్లాండ్స్‌తో అమెరికాలో రిసెర్చిచేసిన ఒక బెంగాలీ డాక్టరు ఢిల్లీలో ప్రాక్టీసు పెట్టాడని మెడికల్ జర్నల్‌లో చదివాను" అన్నది రత్నం.

"అలాగా? అయితే మన బాబుని తీసుకునివెళ్ళి చూపించమన్నావా?" అని ఆతృతగా అడిగింది శ్రీవళ్ళి.

"ఇది చివరి ప్రయత్నంగా చేయండి. పిట్యూటరీ గ్లాండ్ మార్పిడిలాంటి దేదైనా



వీలుంటుందేమో అతనికి తెలుస్తుంది" అన్నది రత్నం.

ఆరోజు ఎంతో ఉత్సాహంగా ఆ వార్త భర్తతో చెప్పింది శ్రీవళ్ళి.

"బాబుని తీసుకుని వెళదామా?" అన్నది శ్రీవళ్ళి.

"సరే. నీ మనసు తృప్తికోసం అంగీకరిస్తున్నాను. కాని నేను వచ్చినందువల్ల ప్రయోజనం లేదు. మీ స్నేహితురాలు డాక్టర్ రత్నంగారిని తీసుకుని వెళ్ళు," అన్నాడు సుబ్బారావు.

మరునాడు రత్నందగ్గరకు వెళ్ళింది శ్రీవళ్ళి.

"నువ్వు నాకీ ఉపకారం చెయ్యాలి, రత్నం. ఆ బెంగాలీ స్పెషలిస్టు దగ్గరకు నువ్వుకూడా బాబుతో రావాలి."

"నేనెందుకే. మీ ఆయన ఉన్నారుకదా" అన్నది రత్నం.

"మాఆయన రారు. నిన్ను బ్రతిమాలి తీసుకుని వెళ్ళమన్నారు. నీకు పుణ్యం ఉంటుంది, రావే, రత్నం" అన్నది శ్రీవళ్ళి.

"సరేలే" అని అంగీకరించింది రత్నం.

శ్రీవళ్ళి, రత్నం, బాబుని తీసుకుని ఢిల్లీ వెళ్ళారు.

ఆ బెంగాలీ స్పెషలిస్టు ప్రొఫెసర్ ఛటర్జీ ఉన్న చోటికి వెళ్ళారు. అప్పటికింకా వేరే రోగులెవరూ రాలేదు.

బయట హాలులో కూర్చుని నౌఖరు ద్వారా లోపలికి కబురు పంపించింది రత్నం. లోపలికి రావచ్చునని నౌఖరువచ్చి చెప్పాడు.

రత్నం, శ్రీవళ్ళి బాబుని తీసుకుని లోపలికి వెళ్ళారు. లోపల ఒక పెద్దబల్ల దగ్గర ప్రొఫెసర్ ఛటర్జీ కూర్చున్నాడు. సాధారణంగా ఆడవాళ్ళు వస్తే లేచి స్వాగతం చెప్పడం సభ్యత అయినప్పటికి అతడు లేవకపోవడం చూసి శ్రీవళ్ళి ఆశ్చర్యపడింది. కానీ రత్నం ఆశ్చర్యపడలేదు. బల్లకి ఎదురుగా ఉన్న కుర్చీలను చూపిస్తూ, "దయచేసి కూర్చోండి" అన్నాడు ప్రొఫెసర్ ఛటర్జీ ఇంగ్లీషులో.

"నాపేరు రత్నం. నేను ఆంధ్రా మెడికల్ కాలేజీలో చదివి ఎం. బి. బి. ఎస్. పాసయ్యాను. ఎం. డి. కి కూడా స్టడీ చేస్తున్నాను. ఈమె నా స్నేహితురాలు శ్రీవళ్ళి"

అని రత్నం చెబుతూ ఉంటే, ప్రొఫెసర్ ఛటర్జీ శ్రీవళ్ళిని చూసి,

"మీ ముఖం నాకు పరిచయం ఉన్న ముఖంలాగ ఉందేమండీ. మనదేశంలో సచిత్ర పత్రిక లన్నిటి ముఖ చిత్రాలలోనూ మీ ముఖం పోలిన ముఖమే చూస్తున్నాను" అన్నాడు.

"అవును డాక్టర్. ఈమె భర్త ప్రఖ్యాత చిత్రకారుడు సుబ్బారావు. ఆయన వేసే అన్ని బొమ్మలకూ మోడల్ ఈమే" అన్నది రత్నం.

"చాలా మంచి మోడలే. ఈ రోజు నాది చాలా సుదినం. వీరిని చూడగలిగాను" అన్నాడు ప్రొఫెసర్ ఛటర్జీ.

"ఈ పిల్లవాడు ఈమె కొడుకు. వీడే మీరు పరీక్ష చేయవలసిన పేషెంట్. ఇవిగో ఇంతవరకు జరిగిన మెడికల్ పరీక్షల యొక్క రిపోర్టులు" అని ఒక కాగితాల కట్టను అతనికి అందించింది.

ప్రొఫెసర్ ఛటర్జీ ఆ కాగితాలను అతి వేగంగా పరిశీలించాడు.

"చేయవలసిన పరీక్షలన్నీ యిదివరకే జరిగిపోయాయి. నేను ఏమి చేయగలనని మీ రనుకుంటున్నారు?" అన్నాడు ప్రొఫెసర్ ఛటర్జీ.

"మీరు కోతిగ్లాండ్స్‌తో కొంత రిసెర్చి చేశారని మెడికల్ జర్నల్సులో చదివాను. వీని పిట్యూటరీ గ్లాండ్ గురించి ఏమయినా ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయగలరేమో నని ఆశతో వీళ్ళను తీసుకుని వచ్చాను," అన్నది రత్నం.

"చూడండి, అమ్మా. గ్లాండ్ ట్రాన్స్ ప్లాంటేషన్ అంటే యింకా రిసెర్చి పూర్తి కాలేదు. ఒకవేళ ట్రాన్స్ ప్లాంటేషన్ చేయ గలిగినప్పటికి పేషెంటు ఎన్ని నెలలు బ్రతుకుతాడో చెప్పలేము. మానవుడు ఎంత పురోగమిస్తున్నప్పటికీ ఇంకా ప్రకృతిని అధిగమించడంలో చాలా కృషి చేయవలసి ఉంది. శాస్త్రవిజ్ఞానం పెరుగుతున్నది ఒక ప్రక్కనుంచి. కాని మానవుల విలువలలో రావలసిన విధంగా మార్పురావడంలేదు. జీవితం ఎప్పుడూ పరిస్థితులకు అనువుగా మలచుకోవడం తెలియాలి. కేవలం బాహ్య సౌందర్యమే ప్రధానంగా పెట్టుకున్న వారికి మనిషి పొడుగుగా ఉన్నాడా లేక పొట్టిగా ఉన్నాడా అని గాని, సర్వాంగ సుందరంగా ఉన్నాడా లేక వికృతంగా ఉన్నాడాఅనేఅంశం గాని ముఖ్యం అవుతుంది. కాని జీవితాన్ని బాగా అర్థం చేసుకోగలిగిన వారికి విలువలు వేరే విధంగా ఉంటాయి. మీ పిల్లవానినే ఉదాహరణగా తీసుకోండి. అదృష్టవశాత్తు ఒక్క సోమాట్రోపిన్ మాత్రమే తగినంత తయారు కావడం లేదు. అదే ఏ అయిడినో లోపించిందనుకోండి, పరిస్థితి యింకా బాధా కరంగా ఉండేది. ఇప్పుడు మీ పిల్లవాడు అన్ని విధాలా నార్మల్‌గా ఉన్నాడు. ఒక్క మరుగుజ్జుతనం మాత్రమే తప్పదు. అయినా మనం ఏమీ చేయలేనిదానితో మనం రాజీ పడి బ్రతకడం నేర్చుకోవాలి......" అని ప్రొఫెసర్ ఛటర్జీ యింకా ఏమో చెప్ప బోతుంటే,

"ఇకచాలించండి, మీ ఉపన్యాసం.మీకేం, జీవితం వడ్డించిన విస్తరి లాంటిది. ఎన్ని కబుర్లయినా చెప్పవచ్చు. మీకే నా బాబు లాంటి కొడుకు ఉంటే దానిలో ఉన్న బాధ తెలిసి వచ్చేది. మరుగుజ్జుతనంవల్ల ఉండే బాధలు మీరు ఏం అర్థం చేసుకోగలరు?" అని శ్రీవళ్ళి అరిచింది.

"ఆవేశపడకండమ్మా. మరుగుజ్జుతనం అంటే ఉన్న బాధలు నాకంటే ఎక్కువ ఎవరికి తెలుసునమ్మా" అంటూ ప్రొఫెసర్ కుర్చీలోంచి దిగాడు. క్షణంసేపు ప్రొఫెసర్ ఛటర్జీ కనిపించలేదు. బల్లచుట్టూ తిరిగి శ్రీవళ్ళి రత్నంఉన్నవైపు వచ్చాడు. అతని ఆకారం చూచి శ్రీవళ్ళి నిలువునా నీరయింది. అతడు మూడు అడుగులకంటె ఎక్కువ పొడుగుగా లేడు. నడుందగ్గర నుంచి తలవరకు లావుగా ఉండి, కాళ్ళ దగ్గర చాలా పొట్టిగా ఉన్నందువల్ల అతడు కూర్చున్నంతసేపూ అతడు మరుగుజ్జు అని ఎవరూ తెలుసుకోలేకపోయారు.

అతడు మరుగుజ్జు అని రత్నంకు యిది వరకే తెలుసు. కాని మరుగుజ్జుతనంవల్ల జీవితంలో ఓడిపోయినట్లు భావించనక్కర లేదని, మరుగుజ్జుగా ఉన్నవారిలో కూడా ఎంతటి మేధావంతులుంటారో చూపించాలనీ ఆమె శ్రీవళ్ళిని ఢిల్లీ తీసుకుని వెళ్ళింది.

"ఇప్పుడు చెప్పమ్మా, నాకు మరుగుజ్జు వారంటె ఎంత సానుభూతి ఉంటుందో. నేను మరుగుజ్జునని తెలిసిననాటినుంచి,నేను చాలా కష్టపడి చదివాను. ఎం. బి. బి. యస్. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడనవడమే కాకుండా పెరుగు దలకు సంబంధించిన విషయాలలో స్పెష లైజు చేస్తూ వచ్చాను. హార్మోన్సు గురించి బాగా పరిశోధించాను. ఎప్పటికయినా మరు గుజ్జుతనం పోగొట్టేమందు కనిపెట్టడమే నా జీవితాశయం. నేను ఓటమినే అంగీకరిస్తే జీవితంపట్ల నాకున్న దృక్పథమే వేరుగా ఉండేది. అందుచేత మీరు మీ బాబుగురించి విచారించకండి. వాడు యితర విధాల అభి వృద్ధికావడానికి తోడ్పడండి" అని సలహా చెప్పాడు ప్రొఫెసర్ ఛటర్జీ.

అంతవరకు జీవితంలో కేవలం శరీర సౌందర్యము, సౌష్టవమే ఎక్కువ ముఖ్య మని నమ్మిన శ్రీవళ్ళికి శరీర సౌష్టవంకంటె ఏది ఎక్కువ ముఖ్యమో ద్యోతకం అయింది.

---